# అశ్రుతర్పణం

శ్రీ వి. ఎస్. ఆర్. కృష్ణశాస్త్రి

గాంధీజీ పోయాడు—ఆఫీసు. ఫైల్సులో మునిగిపోయివుండగా ఈ వార్త వినేప్పటికి వళ్లు మండుకొచ్చింది. నోరుమూయి; ఎవడు చెప్పాడు—అని గద్దించాను కుఱ్ఱాడిమీద. కళ్ళనీళ్లు నింపుకొని "నిజమేనండి—గాంధీమీద అబద్ధం ఎవడు పుట్టిస్తాడండి" అన్నాడు. నిజమే? అబ్బ, ఎంతభక్తి? ఆ కుఱ్ఱవానికి గాంధీ అంటే ఏమిటి తెలుసు? పొట్ట చీలిస్తే అక్షరంరాని ఈ నిరక్షరాస్యునికి కూడా అర్ధమైన గాంధీజీ—అతని కళ్ళనీళ్లు నింపిన గాంధీజీ మరణించాడా?

నమ్మలేను.

తలుపులు మూసేసారు. నిజమా, అబద్ధమా అనే ఆదుర్దాతో రోడ్డుమీకే వస్తున్నాను. రోడ్డంతా జనం. గుంపులు గుంపులుగా చేరి ఎవరికి తోచిన వార్తలు వారు చెప్పుకుంటున్నారు. హిందూస్థానీలో వార్తలు వచ్చాయట—గాంధీజీ హంతకుని తుపాకీ గుండ్లవలన మరణించాడట—వొకటే గొడవ. కొంతమంది యువకులు ప్రతి దుకాణంమీదకువెళ్ళి కొట్లు కట్టించేస్తున్నారు; కొన్ని బలవంతంమీద కట్టించేస్తున్నారు. కాఫీహోటళ్లు దగ్గర్నించీ కట్టేస్తున్నారు.

గణపతి విలాసులో బల్లలు బోర్లించేసి రేడియో పెట్టాడు. తెలుగువార్తలు వస్తాయి; విందామని ఒక పెద్దగుంపు చేరారు. నేనుకూడా చేరాను. దిక్కుమాలిన రేడియో ఆర్కెస్ట్రా మ్రోగుతోంది; మధ్యమధ్యన ఒక అరవవాడు భోంయి మంటున్నాడు. నా ప్రక్కనే ఒక తురక వున్నాడు. వాడన్నాడు: ఇంక ముసల్మాను హిందూస్థానంలో వుండలేడు బాబూ; ఈ పాకిస్థానం మా ప్రాణానికి వచ్చింది. పల్లెటూరినుంచి కూరలు కావిడి తేసుకొనివచ్చి అమ్మేసుకొని తిరిగి ఇంటికిపోయే గ్రామస్థుడన్నాడు—కలియుగ రామచంద్రుడనుకున్నాను; అయనమీద తుపాకీ ఎల్లా ఎత్తగలిగారో. ఒక కాలేజీ కుఱ్ఱాడు అన్నాడు—ఎల్లాంటి International consequences వస్తాయో చెప్పలేము; ఇండియాకు జ్యోతి ఆరిపోయిందనుకోండి. ఒక ఎనిమిదేళ్ళ కుఱ్ఱాడు అన్నాడు—చాలా మంచివాడండి గాంధీ; నాకేడ్పు వస్తోంది. జనం వత్తిడికి ఇబ్బంది పడుతున్న కాలేజీ విద్యార్థిని అంది—ఎన్ని గురంతాలు చేసినా మొగాళ్లే చెయ్యాలి; మంచీ చెడ్డా అక్కరలేదు, ఒక హాహోహత్యం చేసే శాస్త్రుల్లుగా రస్నారు—ప్రపంచానికి ప్రళయం ఆసన్నమైన దనుకోండి; మహాత్ముని మరణంతో ఆగదండి; ముందున్నది ముసళ్ళ పండుగ—

ఆలిండియా రేడియోపలుకుతోంది. రేడియోకూడా ఏడుస్తున్నట్లేవుంది. నిజమే? గాంధీజీ మరణించాడు; హంతకుని తుపాకీ గుళ్ళవలన మరణించాడు. ప్రాణం, చలనంలేని రేడియో ఏమైనా నిత్యసత్యవ్రతం దాల్చిన హరిశ్చంద్రుడా; అబద్ధం ఎందుకు చెప్పకూడదు? ఎన్నటికీ కాదు. ప్రాణం, చలనం లేనివి మాట్లాడడమంటూవస్తే నిజమే మాట్లాడుతాయి కాని అబద్ధం మాట్లాడవు. ఆకాశవాణి తీర్పు ఎప్పుడూ ఖాయమే. అబ్బ, నమ్మలేని సత్యం!! ఇన్ని తరాల మనుష్యులకు వంద్యుడైన గాంధీజీ మరణం—అందులో ఆ విధమైన మరణం—ఎల్లా నమ్మగలం?

మన్నులోంచి మనుష్యులను, నాయకులను తయారు చేసినవాడు గాంధీజీ. నిద్రాణమైవున్న భారతజాతికి మేలుకొల్పులు పాడి, ఒక ఆశయాన్ని ఆ ఆశయ సాధనకు మార్గాన్ని చూపించినవాడు గాంధీజీ. దేశంలోని దరిద్రనారాయణునితో తన్ను రూపించుకొని పీడితజాతుల ముక్తికై జీవితమంతా శ్రమించి, ఆ ప్రయత్నంలోనే మరణించినవాడు గాంధీజీ. మాటలకు పరిమితమగు శక్తిమాత్రమేవుంది. ఏ మాటలు కూడా గాంధీపై మనకుగల శక్తివిశ్వాసాలను వెల్లడించడానికి శక్తిరహితములే అవుతాయి.

గాంధీజీని పొగడుతాము; గౌరవిస్తాము; కావలిస్తే విగ్రహాలుచేసి గుళ్లో పెడతాము. కాని ఆయన చెప్పినవి అనుసరించము. గాంధీజీ చెప్పినవాట్లలో వేని ననుసరించాము? ఏ ప్రవక్త యొక్క సిద్ధాంతాలను అనుసరించాము కనుక—బ్లాకుమార్కెట్టు చెయ్యవద్దంటే వర్తకులు మానారా? త్రాగుకు కూడదంటే, ఛాంపేనులు పరిగ్రహించే వారెంతమంది లేరు? ఆయన చెప్పినట్లు, సోదరులలాగ హిందూ ముస్లింలు నివసించినట్లయితే ఆయన మరణమే సంభవించేదా? ఆయననుగూర్చి హర్తాళాలు, స్మారకసభలు, ఉపవాసాలు—ఇల్లాంటి అట్టహాసాలుకన్న ఆయన చెప్పిన విషయాల్లో ఏ కొంచెమైన అనుసరించినట్లయితే ఆయన ఆత్మశాంతి చెందుతుంది.

"బాబూ, గాంధీ చచ్చిపోయాడంటున్నారు; నిజమేనాండీ?"—ఒక రిక్షావాడు అడిగాడు. వాడికిగూడా అంత ఆప్తుడైనాడు గాంధీజీ. విచారచిహ్నంగా ధనవంతులు త్రివర్ణ పతాకాలు వాల్చేసారు. అంతకన్న అధికమగు విచారచిహ్నం ఆ రిక్షావాని కన్నీటిచుక్క.